క్లుప్తంగా

'పురం'లో ట్రాఫిక్ ఆంక్షలు



పట్టణంలోని గురునాథ్ సర్కిల్

హిందూపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో హిందూపురం పట్టణంలో గురువారం నుంచి ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. 18 నుంచి 25వ తేదీ వరకూ నిబంధనలు అమల్లో ఉంటాయి. పెనుకొండ వైపు నుంచి బెంగళూరు వెళ్లే వాహనాలు పట్టణంలోని గురునాథ్ సర్కిల్, రిలయన్స్ బంకు, ఆటో నగర్ మీదుగా కిరికెర క్రాస్ వద్ద బెంగళూరు రోడ్డులో కలుస్తాయి. బెంగళూరు వైపు నుంచి వచ్చే వాహనాలు సైతం అదే రూటులో రావాల్సి ఉంటుంది. లేపాక్షి, చిలమత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలు రహమత్‌పూర్, రిలయన్స్ పెట్రోల్ బంక్, బీఎస్టీ సర్కిల్‌కు చేరుకుంటాయి. మడకశిర, పరిగి మీదుగా బెంగళూరు వెళ్లే వాహనాలు పరిగి బస్టాండ్ మీదుగా బెంగళూరు వెళ్తాయి. హిందూపురం పట్టణంలో భారీ వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు, బీఎస్టీ సర్కిల్, ఓల్డ్ ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాలకు అనుమతిలేదని డీఎస్పీ తెలిపారు.

ఉచిత సామూహిక వివాహాలు



ఒక్కటైన నూతన జంటలు

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో వెలిసిన నీలకంఠేశ్వరస్వామి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్ ఎన్ రఘువీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉచిత సామూహిక వివాహాలు జరిగాయి. ఈ సందర్భంగా 10 జంటలు ఒక్కటయ్యాయి. కర్ణాటక రాష్ట్రం పట్టనాయకనహళ్లి వక్కలిగ పీఠాధిపతి నంజావధూతస్వామి , ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆలయానికి కలశాల వితరణ



గోపుర కలశాలను వితరణ చేస్తున్న కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

హిందూపురం: పట్టణంలోని శ్రీకంఠాపురంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ గోపురానికి సంబంధించిన కలశాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, తాడిపత్రి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి వితరణగా అందజేశారు. ఈ మేరకు గురువారం కలశాలను ఆలయ గురుస్వామి లింగప్ప, వడ్డెర సంఘం నాయకుడు రంగప్పలకు అందించారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రాధాన్యం

మడకశిరరూరల్: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలి డాక్టర్ సేవలను గ్రామంలోనే నిర్వహిస్తుందని మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఎం రంగాపురం గ్రామంలో గురువారం జరిగిన రంగనాథస్వామి ఉత్సవాల్లో వారు నాయకులతో కలిసి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'ఎస్సీ వర్గీకరణకు ప్రధాని అంగీకరించారు'

పావగడ: ఎస్సీ వర్గీకరణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంగీకరించారని మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే ఏర్పాటయ్యే ఎన్డీఏ ప్రభుత్వ ఆధ్వర్యంలో మొదటి పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేస్తామన్నారని వెల్లడించారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో గురువారం నిర్వహించిన బీజేపీ ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు



జాగ్రత్తలను వివరిస్తున్న ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్

హిందూపురం అర్బన్: కర్మాగారాల్లో ముందు జాగ్రత్తలు తీసుకొంటే ప్రమాదాలను నియంత్రించవచ్చని ఫైర్ అధికారి ప్రభాకర్ తెలిపారు. తూమకుంట పారిశ్రామిక వాడలో గురువారం తులిప్ ఇండస్ట్రియల్ లిమిటెడ్ కంపెనీలో యాజమాన్యం, కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమికంగా అవసరమైన పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మంటలు ఆర్పే విధానాన్ని వివరించారు.

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ షురూ

- అభ్యర్థితో కలిపి ఐదుగురికే అనుమతి
- తొలిరోజు 'పురం'లో ఒకే ఒక్క నామినేషన్ దాఖలు
- నామినేషన్ కేంద్రాల వద్ద భారీగా పోలీసు బందోబస్తు





హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్ కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు , తహసీల్దార్ కార్యాలయంలోని అసెంబ్లీ నామినేషన్ స్వీకరణ కేంద్రం

హిందూపురం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణ ఘట్టం గురువారం నుంచి మొదలైంది. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్ల ప్రకియ ప్రారంభమైంది. పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థుల నామినేషన్లు మాత్రం జిల్లా కేంద్రాల్లోనే ఏర్పాటయ్యాయి. ఈనెల 25ను నామినేషన్లకు చివరి తేదీగా నిర్ణయించారు. 26న నామినేషన్లను పరిశీలిస్తారు. 29వ తేదీ లోపు నిర్ణీత సమయం వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఉపసంహరణ సమయం ముగియగానే ప్రభుత్వ నిబంధనల మేరకు అదే రోజున అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. వచ్చే నెల 13న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటనలతో ప్రక్రియ ముగుస్తుంది.

'పురం'లో ఒక నామినేషన్ దాఖలు

హిందూపురం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. హిందూపురం తహశీల్దార్ కార్యాలయంలో సంయుక్త కలెక్టర్, నియోజకవర్గ ఆర్‌ఓ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ చేపట్టారు. మొదటిరోజు బీఎస్పీ పార్టీ నుంచి బి.శ్రీరాములు మొదటి నామినేషన్ దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.

నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం నామినేషన్ కేంద్రం గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఆఫీసు ప్రారంభం వద్ద పోలీసులు తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అటుగా వచ్చిన వారిని విచారించి పంపుతున్నారు. తర్వాత తహసీల్దార్ కేంద్రం వద్ద మరో తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కేవలం నామినేషన్ దాఖలు చేసే వారిని మాత్ర మేలోనికి అనుమతించేలా ఏర్పాటు చేశారు.

పెనుకొండ, మడకశిరలో నిల్

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఉదయం 10 గంటల నుంచి సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ నేతృత్వంలో అధికారులు నామినేషన్ల స్వీకరణకు సిద్ధమయ్యారు. అయితే తొలిరోజు ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదని అధికారులు తెలిపారు. మరోవైపు డీఎస్పీ బాజీదాన్‌సైదా ఆదేశాల మేరకు సీఐ యుగంధర్, ఎస్ఐ రాజేష్ ఇతర సిబ్బందితో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు, జవాన్లు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద గట్టి పహారా నిర్వహించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలోకి ఎవరినీ అనుమతించలేదు. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు, అంబేడ్కర్ సర్కిల్, పోస్టాఫీస్ ప్రాంతాల్లో ప్రధాన రహదారులను పోలీసులు పూర్తిగా నిర్బంధించారు. ఏ ఒక్క వాహనాన్నీ వదలేదు.

మడకశిర: మడకశిర ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ స్థానానికి తొలిరోజు గురువారం ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గం ఆర్‌ఓ గౌరీశంకర్ ఆధ్వర్యంలో ఏఆర్‌ఓ వెంకటేశ్, ఎన్నికల విభాగం డీటీ మారుతీప్రసాద్ తదితర అధికారులు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. అయితే తొలి రోజు నామినేషన్లు దాఖలు కాలేదని ఆర్‌ఓ గౌరీశంకర్ తెలిపారు. ఇదిలా ఉండగా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో పోలీసులు తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు బందోబస్తు కొనసాగుతుందని అర్బన్ సీఐ మనోహర్ తెలిపారు.

నామినేషన్ల స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు

- ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకురావాల్సింది ఉంది. అన్ని రకాల డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటే నామినేషన్లను అనుమతిస్తారు.
- పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం -2ఏ, అసెంబ్లీ నియోజకవర్గం కోసం ఫారం-2బీ ఫారాలు సమర్పించాలి.
- ప్రకటించిన తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ల స్వీకరిస్తారు.
- పబ్లిక్ సెలవు దినాలలో నామినేషన్ స్వీకరించరు.
- పోటీ చేసే అభ్యర్థులు అత్యధికంగా 4 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు.
- పోటీ చేసే అభ్యర్థులు రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల నుంచి నామినేషన్లను దాఖలు చేయడం కుదరదు.
- నామినేషన్ దాఖలు సమయంలో నామినేషన్ కేంద్రం వద్ద 100 మీటర్ల పరిధి వరకూ మూడు వాహనాలు వరకే అనుమతి ఉంటుంది. నామినేషన్ కేంద్రం వద్దకు అభ్యర్థితో పాటు నాలుగురికి మాత్రమే ఆర్‌ఓ ఆఫీస్‌లోకి ప్రవేశించడానికి అనుమతి ఉంటుంది.
- నామినేషన్ల కేంద్రం వద్ద నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ఒక హెల్ప్ డెస్క్ ఉంటుంది. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ నామినేషన్లకు సంబంధించిన అన్ని వివరాలు పరిశీలించుకుని అన్ని సక్రమంగా ఉన్నాయని నిర్ధారణ చేసుకుని నామినేషన్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుంది.
- నామినేషన్ స్వీకరణకు అసెంబ్లీ అభ్యర్థి రూ.10 వేలు, పార్లమెంట్ అభ్యర్థి రూ.25 వేలు ధరావత్తుగా చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం రాయితీ ఉంటుంది.
- అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచి అభ్యర్థి ఎన్నికల కోసం చేసే ఖర్చు అతని ఖాతాలో లెక్కిస్తారు.
- పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ వార్తలను అభ్యర్థి ఖాతాలోనే లెక్కిస్తారు.
- ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి రూ.40 లక్షల ఖర్చు పరిమితి ఉంటుంది. అలానే పార్లమెంట్ అభ్యర్థికి రూ.95 లక్షలు ఖర్చు పరిమితి ఉంటుంది.
- పోటీచేస్తున్న అభ్యర్థుల కదలికలు ప్రచార ఖర్చులు, నిబంధలు పాటిస్తున్నారా అనే విషయాలపై నిరంతరం నిఘా ఉంటుంది.

జగన్‌పై షర్మిల విమర్శలు మానుకోవాలి



మాట్లాడుతున్న పార్టీ పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేసిన ఆరోపణలను వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. వైఎస్ జగన్‌పై షర్మిల తప్పుడు విమర్శలు మానుకోవాలని హితవుపలికారు. గురువారం స్థానిక మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 23న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్ఎల్ ఈరలక్కప్ప నామినేషన్ కార్యక్రమంపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, వాగేష్, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, అసెంబ్లీ ఇన్‌చార్జ్ అనంతరాజు, డైరెక్టర్ నాగరాజు, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరాములు తదితరులు మాట్లాడారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక మడకశిర నియోజకవర్గానికి కృష్ణాజలాలు వచ్చాయని తెలిపారు. వైఎస్ జగన్ హయాంలో మడకశిర బైపాస్ కెనాల్ నిర్మాణానికి రూ.215 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. వైఎస్సార్‌ను ఆదర్శంగా తీసుకుని వైఎస్ జగన్ పాలన చేస్తున్నారని పేర్కొన్నారు. వీటిని గుర్తించకుండా వైఎస్ జగన్‌పై షర్మిల విమర్శలు చేయడం న్యాయం కాదన్నారు. చంద్రబాబుతో కుమ్మక్కై షర్మిల విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్‌పై విమర్శలు చేయడాన్ని మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈరలక్కప్ప ఈనెల 23న నామినేషన్ వేస్తారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేడు మంత్రి పర్యటన

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కోనాపురం, కొండాపురం, మంగాపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మంత్రి ఉషశ్రీచరణ్ ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టిగా పనిచేయండి



అగళి మండలం బీరనపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

అగళి: మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని హళ్లికేర, నరసబుంది, ఇనగలూర్ పంచాయతీ పరిధిలోని హళ్లికేర, గోళ్లహట్టి, ముత్తేపల్లి, బీరనపల్లి, దొక్కలపల్లి, నరసబుంది, గ్యార్గనపల్లి గ్రామాల్లో ఈరలక్కప్ప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత హళ్లికేర ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నేటి దాకా సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల ఇంటికి ముంగిటకే చేర్చినట్లు పేర్కొన్నారు. మళ్లీ యథావిధిగా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి వైఎస్ జగన్ సీఎం అయితేనే అది సాధ్యం అవుతుందన్నారు. ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడిన సమయంలో టీడీపీ అండ్ కో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసగించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వారు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసింది శున్యమని విమర్శించారు. కేవలం టీడీపీ నాయకులు జన్మభూమి కమిటీల పేరుతో దాచుకోవడం.. దోచుకోవడం.. పంచుకోవడంలోనే సరిపోయిందన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ చేసిన అభివృద్ధి ఇంత వరకూ ఎవరూ చేయలేదన్నారు. మరోసారి వైఎస్ జగన్‌కు పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు, డైరెక్టర నేత్రావతి, సంయుక్త కార్యదర్శులు రంగేగౌడ్, రవిశేఖర్‌రెడ్డి, ఎంపీపీ రేణుక, మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ శివన్న, సర్పంచు ముద్దరాజు, శివకుమార్, రామకృష్ణప్ప, సరస్వతి, ఎంపీటీసీ సభ్యులు మంజుల, నింగమ్మ, కోఆప్షన్ మెంబర్ నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా చేసిన 28వ వార్డు వలంటీర్లు

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలోని 28వ వార్డు సచివాలయం పరిధిలోని 8 మంది వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామాల పత్రాలను మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ జె.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: గోరంట్ల పరిధిలోని 25 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రాజీనామ లేఖలను ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు.

అగళి: మండల పరిధిలోని హళ్లికేర సచివాలయానికి చెందిన ఆరుగురు, మధూడి పంచాయతీకి చెందిన నలుగురు వలంటీర్లు గురువారం ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌కు రాజీనామా లేఖలను అందించారు.

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామ సచివాలయం 2 పరిధిలోని గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లు ఎన్.మంజుల, ఆర్.అనిత, కొర్రేవు నాగరాజు, మహలింగప్ప, కె.నాగరాజు రాజీనామా చేశారు. ఎంపీడీఓ మునిస్వామికి రాజీనామా లేఖలను అందజేశారు.

నేడు ఎన్నికల ప్రచారం

రొళ్ల: మండల పరిధిలోని గుడ్డగుర్కి, దొడ్డేరి పంచాయతీలో శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు, మడకశిర అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు తెలిపారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



తుమ్మలకుంటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక

చిలమత్తూరు: ప్రజా సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక అన్నారు. గురువారం మండలంలోని టేకులోడు పంచాయతీలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపిక పంచాయతీలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్నీ అమలు చేసిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన మరోసారి కచ్చితంగా సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. పురంలోనూ కూడా వైఎస్సార్సీపీ జెండా ఎగరవేయాలని, ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణను టీడీపీ కూటమి నేతలు ఓర్వలేకపోతున్నారన్నారు. ప్రజలు ఓటుతో టీడీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మండల కన్వీనర్ రాజారెడ్డి, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, కవిత, నాయకులు అన్సర్ అహ్మద్, శేషాద్రిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలాజీరెడ్డి, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ కన్వీనర్ బద్రీ



కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న చరణ్‌రెడ్డి

పరిగి: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల కన్వీనర్ వాల్మీకి బద్రీనాథ్ వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం మండల కేంద్రం పరిగిలో రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి సమక్షంలో స్థానిక నాయకులు ఇర్షాద్ అహ్మద్, సింగారెడ్డి, మండల కన్వీనర్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బద్రీతో పాటూ ప్రముఖ రైతు సంఘం నాయకుడు గణేషప్ప, టీడీపీకి చెందిన గోరంట్ల సుధీర్‌రెడ్డి, నిజ్జూ, ఖలందర్ తదితరులకు చరణ్‌రెడ్డి చేతుల మీదుగా పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బద్రీనాథ్ మాట్లాడుతూ బీజేపీ అధిష్టానం అనుసరిస్తున్న విధి విధానాలు తనకు నచ్చలేదన్నారు. కష్టకాలంలో ఉన్న ఎంతో మంది నాయకులను పార్టీ గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన నచ్చడంతోనే పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, ఉషశ్రీచరణ్ గెలుపుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సవిత, కోఆప్షన్ మెంబర్ సలీం, ఎంపీటీసీలు చంద్రారెడ్డి, మారుతీరెడ్డి, హొన్నంపల్లి సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి నాయకులు మున్నా, అల్తాఫ్, జిక్రియా, శంకర్‌రెడ్డి, హరి, శేఖర్, సిద్ధారెడ్డి, సత్తిరెడ్డి, లక్ష్మీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా గడిచిన నెల రోజుల్లోపే టీడీపీ కన్వీనర్ లక్ష్మీరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డితో పాటు తాజాగా బీజేపీ కన్వీనర్ బద్రీనాథ్ రావడంతో మండలంలోని వైఎస్సార్‌సీపీ క్యాడర్‌లో నూతనోత్తేజం నెలకొంది.

సామాజిక మాధ్యమంపై నిఘా

లేపాక్షి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమంపై కూడా నిఘా ఉంచినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఎవరైనా ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టా, వాట్సాప్ తదితర మాధ్యమాల ద్వారా రెచ్చగొట్టేలా, ఒక వర్గాన్ని కించ పరిచేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవన్నారు.

చింత చెట్టుకు నిప్పు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ గ్రామ శివారులో ఓ చింత చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. గురువారం మధ్యాహ్న సమయంలో హిందూపురం – మడకశిర ప్రధాన రహదారిలో ఉన్న చింత చెట్టుకు దుండగులు నిప్పంటించారు. చెట్టుపై విద్యుత్ తీగలు ఉండటతో విద్యుత్ సిబ్బంది సరఫరా ఆపేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

మడకశిరరూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే , ఎంపీ అభ్యర్థులు ఈరలక్కప్ప, శాంతమ్మ గెలుపే లక్ష్యంగా పని చేద్దామని మాజీ ఎంపీపీ, నాట్య మండలి అకాడమీ డైరెక్టర్ శాలిని కోరారు. గురువారం కల్లుమర్రిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశమై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంజునాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు యాదవుల ఆత్మీయ సమ్మేళనం

మడకశిరరూరల్: స్థానిక యాదవ కల్యాణ మంటపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ యాదవ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ యాదవ్, నాగేంద్రయాదవ్, చిత్తన్న తదితరులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్ప హాజరవుతారన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుడిబండ: మండల పరిధిలోరి కరికెర చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాల తనిఖీ చేస్తుండగా కేఎస్ పల్లికి చెందిన సురేష్, తిమ్మరాజు మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,100 విలువ గల 97 మద్యం ప్యాకెట్లను సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు



ఎడ్లబండ్లపై ప్రసాదం తీసుకొస్తున్న దృశ్యం

వేడుకగా సిద్ధారూఢ స్వామి రథోత్సవం

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లికి వెళ్లే రహదారిలో వెలసిన సిద్ధారూఢస్వామి రథోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాలతో ఆలయం నుంచి స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువు దీర్చారు. సిద్ధేశ్వర మహారాజ్‌కీ జై అంటూ రథాన్ని తమ్మడేపల్లిలో ఉన్న పాదుకట్ట వరకూ లాగారు. అనంతరం ఎద్దుల బండ్లపై ప్రసాదాన్ని తీసుకొచ్చారు.

నేటి నుంచి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి గ్రామంలో సజ్జగంట రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం అంకురార్పణ, ధ్వజారోహణ, 23న రథోత్సవం, 24న దీపోత్సవం, 28న పూల పల్లకీ ఉత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి తెలిపారు.

సమాధి ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

లేపాక్షి: మండలంలోని కొండూరు పంచాయతీ పరిధిలోని వడ్డిపల్లి గ్రామంలో శ్మశాన వాటికలో ఉన్న సమాధిని ధ్వంసం చేసిన దుండుగులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన ప్రజలు గురువారం ఎస్ఐ గోపికి ఫిర్యాదు చేశారు. ఇటీవల గ్రామంలోని సర్వేనంబర్ 59–3లో 1.29 ఎకరాల భూమిని శ్మశాన వాటిక కోసం ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందని తెలిపారు. అయితే మార్చి 31న తమ గ్రామానికి చెందిన యల్లమ్మ అనే మహిళ మృతి చెందడంతో ఆ శవాన్ని శ్మశాన వాటికలో పూడ్చినట్టు పేర్కొన్నారు. అయితే బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సమాధిని ధ్వంసం చేసి నేలమట్టం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాధిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.